# ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే ముఠా గోపాల్



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ / కవాడిగూడ / చిక్కడపల్లి, అక్టోబర్ 3 : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. హిమాయత్‌నగర్ మండల కార్యాయలంలో మంగళవారం కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ఎమ్మెల్యే 22 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ముఠా జయసింహ, కార్పొరేటర్ రచనశ్రీ, డిప్యూటీ తాసీల్దార్ రఘు విష్ణు, స్పెషల్ ఆర్ఐ మధు, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజస్, దామోదర్‌రెడ్డి, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**రూ. 30 లక్షలతో కరాటే షెడ్డు పనులు ప్రారంభం..**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నదని ఎమ్మెల్యే అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్కులో కరాటే కోచింగ్ సెంటర్‌కు షెడ్డు నిర్మాణం కోసం రూ. 30 లక్షల వ్యయంతో నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరాపార్కులో కొంత కాలంగా కరాటే కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారని, షెడ్డు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని కోచింగ్ నిర్వాహకులు కోరడంతో రూ.30 లక్షలతో నూతనంగా షెడ్డు నిర్మాణంతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, ముచ్చుకుర్తి ప్రభాకర్, నాయకులు శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**ఐటీఐలో సౌకర్యాల కల్పనకు కృషి..**

ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐలో సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ స్నాతకోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకుముందు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కళాశాల చుట్టూ కాంపౌండ్ వాల్, మూత్ర శాలల ఏర్పాటుకు అసవరమైన నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.హనుమానాయక్, అధ్యాపకులు రామానంద్, జీ విశ్వపాలక్‌రెడ్డి, ఆఫీజ్, పీఎల్ కార్తీక్ కుమార్, మోహన్‌రెడ్డి, భరత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## బతుకమ్మ చీరల పంపిణీకి రండి



బతుకమ్మ చీరలను అందించే కార్యక్రమాన్ని కార్వాన్ నియోజకవర్గంలో బుధవారం ప్రారంభించనున్నట్లు డీసీ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. ఆరు డివిజన్లలో ఎంపిక చేసిన 38 కేంద్రాల్లో పంపిణీ ఉంటుందని చెప్పారు. మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశామని, బుధవారం మహిళలు చీరలను తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడానికి రావాలంటూ డీపీవో లలితకుమారి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. - మెహిదీపట్నం, అక్టోబర్ 3

## ఆకట్టుకున్న భక్తామృతం



డాక్టర్ సుజరితరాజన్, సుప్రజ సుందర రాజన్ నేతృత్వంలోని కళాకృతి బృందంచే మంగళవారం రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై ' భక్తామృతం ' కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ యూనివర్సిటీ డ్యాన్స్ ప్రొఫెసర్, డాక్టర్ యశోద ఠాకూర్, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం నృత్య నిపుణులు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ 60 మంది ప్రతిభావంతులైన బృందం ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజరిత సుందర రాజన్, సుప్రజ సుందర రాజన్‌ను వారు అభినందించారు. - రవీంద్రభారతి, అక్టోబర్ 3

## గుర్తు తెలియని యాచకుడు మృతి

అబిడ్స్, అక్టోబర్ 3 : గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన అబిడ్స్ పీఎస్ పరిధిలోని నాంపల్లి మెట్రో రైల్వే స్టేషన్ ప్రాంతంలో చోటు చేసుకున్నది. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. నాంపల్లి మెట్రో స్టేషన్ రోడ్ ప్రాంతంలో 40 ఏండ్ల వరకు ఉన్న ఓ గుర్తు తెలియని యాచకుడు ఫిట్స్ వచ్చి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూ కోల్ట్స్ పీసీ కె.సాయి కృష్ణ వెంటనే ప్రాంతానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానాకు తరలించారు. వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలుసుకోవాలనుకునే అబిడ్స్ పోలీసులను ఆశ్రయించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అబిడ్స్, అక్టోబర్ 3 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అబిడ్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సుమన్ కథనం ప్రకారం.. పాత ఎమ్మెల్యే క్వార్టర్స్ బస్‌స్టాండ్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహం స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అతడు 35 ఏండ్ల వరకు ఉండవచ్చని, సంబంధీకులు ఉంటే 8712660114 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## అత్యాచారం కేసులో ఏడాది జైలు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : మలక్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన అత్యాచారం కేసులో నిందితుడు కీర్తి గిడియోన్ జోసెఫ్ (24)కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానాను విధిస్తూ కోర్టు ఇన్‌చార్జి జడ్జి సి.వి.ఎస్.సాయిభూపతి మంగళవారం తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని సమక్షంలో మరో నెల రోజులపాటు జైలుశిక్షను అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అరెమ్ రూపా గ్రేషియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అత్యాచారం సెక్షన్లను జోడించారు. పెండ్లి చేసుకుంటానని నిందితుడు తనను మోసం చేశాడని, అదే విధంగా అత్యాచారానికి పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి కోర్టుకు చార్జిషీటు సమర్పించారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువుకావడంతో కోర్టు శిక్షను ఖరారు చేసింది. మిగిలిన నలుగురి కుటుంబ సభ్యులపై ఈ కేసును కొట్టివేసింది.

## రచయిత్రి శ్రీలక్ష్మికి సినారె వాగ్భూషణ పురస్కారం



శ్రీలక్ష్మికి పురస్కారాన్ని అందజేస్తున్న విద్యాసాగర్‌రావు

ముషీరాబాద్, అక్టోబర్ 3: తెలంగాణ కళా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మికి సినారె వాగ్భూషణ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో శ్రీలక్ష్మికి సినారె వాగ్భూషణ పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాస్యం సేనాపతి, తెలంగాణ కళా వేదిక అధ్యక్షుడు అనుముల దయాకర్, కవి బి. మధుసూదన్‌రెడ్డి, పొన్నం రవిచంద్ర, కుమార్, అడప లలిత, బైస దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

కవాడిగూడ, అక్టోబర్ 3 : ప్రభుత్వ పాఠశాలలో పీఆర్‌సీ రిపోర్టు ప్రకారం రిటైర్డ్‌మెంట్ వల్ల ఏర్పడ్డ 24 వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు నీల వెంకటేశ్ ముదిరాజ్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రామ్మోహన్ రెడ్డి నేతృత్వంలో మెగా డీఎస్సీని 4 నెలలు వాయిదా వేయాలని, ఖాళీగా ఉన్న 24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4,900 పోస్టులు భర్తీ చేయాలని, గత 25 ఏండ్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేయడం లేదని, 5 వేల క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 15 వేల స్వీపర్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘం నాయకులు నందగోపాల్, రాజ్‌కుమార్, శివకృష్ణలతో పాటు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## 'దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం'



దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తానని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎం.పూర్ణ చందర్ రావు అన్నారు. మంగళవారం లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో బస్తీ సంక్షేమ సంఘం నాయకులు ముజ్జిగ పూర్ణ చందర్ రావు అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.రఘు, కోశాధికారిగా సాయిబాబా యాదవ్‌లు ఎన్నికయ్యారు. మిగితా కమిటీని త్వరలోనే ఎన్నుకుంటామని తెలిపారు. - మెహిదీపట్నం అక్టోబర్ 3

## నేడు ఏఎన్ఆర్ శతజయంతి వేడుకలు

ముషీరాబాద్, అక్టోబర్ 3: చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ, శాంత-వసంత ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు చంద్రతేజ ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా రంగానికి అక్కినేని చేసిన సేవలను స్మరించుకుంటూ సినీ సంగీత విభావరి, ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావుకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

### 9న రవీంద్రభారతిలో 'క్రాంతి' నాటకం

రవీంద్రభారతి,అక్టోబర్ 3: క్రియేటివ్ థియేటర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ప్రొడక్షన్ ఓరియెంటెడ్ థియేటర్ యాక్టింగ్ వర్క్‌షాప్ సీజన్-9లో భాగంగా ఈ నెల 9వ తేదీ రవీంద్రభారతిలోని ప్రధాన వేదికపై మెర్సీ మార్గరెట్ రచించిన 'క్రాంతి నాటకం ఘనంగా నిర్వహిస్తామని డిజైన్, సీనోగ్రఫీ అంజయ్ మంకెనపల్లి ప్రతికా ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి నాటక ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### ఇండ్లు కట్టుకోవడానికి అవకాశం కల్పించాలి

కవాడిగూడ, అక్టోబర్ 3: లంగర్‌హౌజ్‌లోని అంబేద్కర్‌నగర్‌లో తమ పట్టా స్థలాల్లో ఇండ్లు కట్టుకోవడానికి అవకాశం కల్పించాలని అంబేద్కర్‌నగర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షాఆలం(మున్న), ప్రమీలాదేవి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అంబేద్కర్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి. రాజేశ్వరి, అజారుద్దీన్, అమీర్, బాధితులు పాల్గొన్నారు.

### కనీస వేతనాలు సవరించాలి

చిక్కడపల్లి,అక్టోబర్ 3 : రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని మంగళవారం తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సభ్యులు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కనీస వేతనాల మండలి సభ్యుడు జే మల్లికార్జున్, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ, అక్టోబర్ 3: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు గాంధీనగర్ పోలీసులు మంగళవారం తెలిపారు. ఏఎస్ఐ నర్సింహా తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ మెట్ల దగ్గర (50) ఏండ్ల వృద్ధుడి మృతదేహం పడి ఉన్నదని సమాచారం అందిందని, మృతుడు రెడ్ కలర్ షాల్వా కప్పుకొని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. గాంధీనగర్ పోలీస్‌లు కేసు దర్యాప్తుచేస్తున్నారు.